నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

- ముస్తాబైన ఆలయాలు
- రోజుకో అవతారంలో దర్శనమివ్వనున్న అమ్మవారు


అద్దంకిలో గంగాజలాన్ని 102 కలశాలతో తీసుకువస్తున్న మహిళలు


కారంచేడులో దసరా ఉత్సవాలకు సిద్ధమవుతున్న వైష్ణవీ దుర్గామాత ఆలయం

కారంచేడు: హిందువుల ప్రవిత్రమైన పెద్ద పండుగ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరించి ఉత్సవాలు జరుపుతారు. మండల కేంద్రమైన కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో ఆదివారం నుంచి దసరా దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలియజేసింది. ఉదయం అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా అలంకరించనున్నట్లు అర్చకులు తెలిపారు. తొమ్మిది రోజులు తొమ్మిది అలంకరణలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు. దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రిపూట అమ్మవారికి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

101 కలశాలతో ప్రత్యేక పూజలు..

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీచక్ర సమేత వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో దసర శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు దేవస్థాన పాలక మండలి అధ్యక్షుడు కోట శ్రీనివాసకుమార్ శనివారం తెలిపారు. దీనిలో భాగంగా మొదటి రోజు గంగపూజ, కలశ స్థాపనలో భాగంగా గుండ్లకమ్మ నది నుంచి 101 కలశాలతో గంగా జలాన్ని భక్తులు నగరోత్సవంగా తీసుకువచ్చి పూజ కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారిని ప్రతిరోజు వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరిస్తారు. ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్య పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అద్దంకి పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీచక్ర సమిత వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు దేవస్థాన పాలకమండలి అధ్యక్షుడు కోట శ్రీనివాసకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా శనివారం అమ్మవారి జయంతి సందర్భంగా పంచామృతాలతో మంగళ వాయిద్యాలతో గుండ్లకమ్మ నది నుంచి 102 కలశాలతో గంగాజలాన్ని భక్తులు నగరోత్సవంగా తీసుకువచ్చి పూజలు నిర్వహించారు.

చీరాల అర్బన్: దసరా ఉత్సవాల సందర్భంగా చీరాల పట్టణంలోని చీరాల, పేరాలలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయాలతో పాటు, భావనాఋషి దేవాలయం, పేరాల శివాలయంలో, ఎంజీసీ మార్కెట్‌లోని అమ్మవారి దేవాలయం, కామాక్షి అమ్మవారి దేవాలయం తదితర దేవాలయాల్లో ఆదివారం నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా దేవాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ప్రతిరోజూ అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులు పాటు ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చనలు నిర్వహిస్తున్నట్లు దేవాలయాల కమిటీల ప్రతినిధులు తెలిపారు. స్థానిక సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారి చిత్రపటంతో పట్టణంలో 108 కలశాలతో నగరోత్సవాన్ని నిర్వహించనున్నారు.

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు రాయల్ స్కూల్లో విద్యార్థులు శనివారం ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలికలు నవరాత్రులలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చే 9 అలంకారాలతో పాటు పలు రూపాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ పేరం రవీంద్రబాబు, పి స్వప్న, ఇన్‌చార్జ్ కె మధుబాబు, హెచ్ఎం సుబ్రహ్మణ్యం, కోటేశ్వరి పాల్గొన్నారు.

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా నవరాత్రుల సందర్భంగా 15న అమ్మవారికి ఆలయ అధ్యక్షుడు ముత్తు కుమరన్ ఇంటి నుంచి అమ్మవారి బంగారు ఆభరణాలు మేళతాళలతో ఆలయానికి చేరుకుంటారు. అనంతరం అఖండ కలశస్థాపన చేస్తారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దసరా నవరాత్రులు ఆదివారం నుంచి జరగనున్నాయని అలయ కమిటి సభ్యులు తెలిపారు. 22న డాన్స్ బేబీ డాన్స్ పోటీలు ఉంటాయన్నారు.


మార్టూరు: అమ్మవారి అలంకారాల్లో విద్యార్థులు


వేటపాలెంలో ఉత్సవాల కరదీపిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

సీసీ రోడ్లు, డ్రైనేజీలకు మహర్దశ

- నియోజకవర్గానికి రూ 3.60 కోట్లు మంజూరు
- ఇన్‌చార్జి ఆమంచి వెల్లడి


నాయకులతో మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్

పర్చూరు (చినగంజాం): ప్రభుత్వం పర్చూరు నియోజకవర్గంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణానికి రూ 3.60 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే, పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. ఇది నియోజకవర్గంలోని వెనుకబడిన గ్రామాలకు శుభపరిణామం అని ఆయన అన్నారు. శనివారం పర్చూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజలకు అందుబాటులో ఉండి వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల గురించి నాయకులతో చర్చించారు. పనులు వెంటనే చేపట్టి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లను కోరారు. మార్టూరు మండలం కోలలపూడిలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.10 లక్షలు, రాజుగారు పాలెంలో కల్వర్టు నిర్మాణానికి రూ.5 లక్షలు, ద్రోణాదులలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు, ఇసుక దర్శిలో డ్రైనేజీల నిర్మాణానికి రూ.5 లక్షలు, మార్టూరు హనుమంతరావు కాలనీలో సీసీ రోడ్లు, ఓపెన్ డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. పర్చూరు మండలంలోని దేవరపల్లిలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ 17.50 లక్షలు, గర్నెపూడి, ఎడారుపల్లెలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ 15.10 లక్షలు, ఏదుబాడులో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ 10.80 లక్షలు, పర్చూరులో డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు రూ.10 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆమంచి వివరించారు. చినగంజాం మండలంలో గొనసపూడి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ 16.50 లక్షలు, పూలవారిపాలెంలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.12 లక్షలు, రాజుబంగారుపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.7 లక్షలు, కొత్తపాలెంలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.10 లక్షలు, మోటుపల్లిలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.6.50 లక్షలు, పల్లెపాలెంలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కారంచేడు మండలంలో కొడవలి వారి పాలెంలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.6 లక్షలు, జరుబులవారిపాలెం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ. 6 లక్షలు, కుంకలమర్రులో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు, స్వర్ణలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.10 లక్షలు, ఆదిపూడిలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ. 5 లక్షలు, కారంచేడులో సీసీరోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి రూ.17 లక్షలు, తిమిడెదపాడులో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.6 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకొల్లు మండలం వంకాయలపాడులో డ్రైనేజీల నిర్మాణానికి రూ.10 లక్షలు, భీమవరంలో సీసీ రోడ్లు నిర్మాణానికి రూ.10 లక్షలు,పావులూరులో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి రూ 10 లక్షలు, ఇంకొల్లు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. యద్దనపూడి మండలం తనుబొద్దివారిపాలెంలో ఓపెన్ డ్రైనేజీల నిర్మాణానికి రూ.12.50 లక్షలు, పూనూరులో సీసీ రోడ్లు, ఓపెన్ డ్రైనేజీల నిర్మాణానికి రూ.25 లక్షలు, యద్దనపూడిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.22.50 లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. పనులు వెంటనే ప్రారంభించి నాణ్యత లోపించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, నాయకులు కఠారి అప్పారావు,పఠాన్ కాలేషావలి,కోట హరిప్రసాద్, తోకల కృష్ణమోహన్, ముప్పాళ్ల రాఘవయ్య, గర్నెపూడి సర్పంచ్ బిరుదు నాగేంద్రం, చెరుకూరు సర్పంచ్ సుబ్బారావు, గృహ సారథి కొట్టే ప్రభుదాసు, నూతలపాటి బలరాం, అడపా సుధాకర్‌రెడ్డి, గాదె సురేష్, గోపతోటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భావన్నారాయణుడి బ్రహ్మోత్సవాలు

చినగంజాం: మండల కేంద్రం చినగంజాంలో వేంచేసియున్న భూదేవి సమేత భావన్నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి స్వామి వారికి 16 వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎం శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు వలివేటి శివనారాయణ, వెంకట రామానుజం, విశ్వనాథబాబు తెలిపారు. గ్రామోత్సవంలో శ్రీ భావన్నారాయణ స్వామి మహిళా కోలాట బృందంచే ప్రతిరోజు కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలను యాజ్ఞిక స్వామి పరాశరం రామాచార్యులచే శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోటరీ సభ్యుడి దాతృత్వం


వస్తువులను అందిస్తున్న దాత

చీరాల అర్బన్: రోటరీ క్లబ్ సీనియర్ సభ్యుడు, బీజేపీ నాయకుడు బండారుపల్లి హేమంత్‌కుమార్ పెళ్లిరోజు సందర్భంగా శనివారం అనాథ పిల్లలకు రూ.10 వేలు విలువ గల 11 రకాల వస్తువులను అందించారు. సేవా కార్యక్రమం నిమిత్తం చీరాల శృంగారపేటలోని ఏడుగురు అనాథ విద్యార్థులకు వస్తువులను అందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు, పోలుదాసు రామకృష్ణ, దోగుపర్తి వెంకటసురేష్, రవిప్రసాద్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కషాయాలతో నాణ్యమైన పంట

ఇంకొల్లు (చినగంజాం): పత్తిలో సప్త ధాన్యాంకుర కషాయం పిచికారీ చేస్తే అధిక దిగుబడితో పాటు నాణ్యమైన పంట పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం ఇంకొల్లు మండల యూనిట్ ఇన్‌చార్జ్ బలగాని వెంకట స్వామి అన్నారు. శనివారం మండలంలోని వంకాయలపాడు గ్రామంలో రైతు గద్దల నాగబాబు పత్తితోటలో సప్తధాన్యాంకుర కషాయం తయారు చేసే విధానం గురించి ఆయన తెలియజేశారు. కషాయం తయారు చేసే విధానంలో ఒక్కొక రకం 100 గ్రాముల చొప్పున 7 రకాల విత్తనాలు తీసుకొని 12 గంటలు పాటు నానబెట్టాలి. తరువాత విత్తనాలు మొలక కట్టుకోవాలి. మొలకలు బాగా వచ్చిన తరువాత రుబ్బి ఆ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి 10 లీటర్ల ఆవు మూత్రం పోసి 24 గంటలు తరువాత స్ప్రే చేసుకోవాలని తెలిపారు. ఈ ద్రావణం వలన పూత రాలకుండా కాయలు సైజు పెరుగుతాయి. అధిక దిగుబడితో పాటు నాణ్యమైన పంట వస్తుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు


తల్లిదండ్రులకు బాలుడిని అప్పగిస్తున్న ఎస్సై

చీరాల: తప్పిపోయిన బాలుడు సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేరాడు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన తొమ్మిది సంవత్సరాల మహమ్మద్ సిద్ధిక్ శనివారం చీరాల రైల్వేస్టేషన్ రోడ్‌లో తిరుగుతున్నాడు. సమాచారాన్ని ప్రైవేటు ట్రావెల్స్ సిబ్బంది మీడియాకు సమాచారం అందించారు. మీడియా ప్రతినిధులు బాలుడిని చీరాల ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాలుడి వివరాలను సేకరించిన పోలీసులు చిలకలూరిపేటలోని బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు చీరాల వచ్చారు. పూర్తి వివరాలను నమోదు చేసుకున్న అనంతరం బాలుడిని ఎస్సై అహ్మద్ జానీ, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ పోతురాజులు బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు.

సంక్షేమ రథసారథి జగనన్న


బల్లికురవలో మాట్లాడుతున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: రాష్ట్రంలోని అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు అర్హతే ప్రామాణికంగా అందిరికీ అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమయిందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శనివారం బల్లికురవ సమీపంలోని ఈర్ల గంగమ్మ సన్నిధానం వద్ద ఏర్పాటు చేసిన 'మళ్లీ ఏపీకి సీఎంగా జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా బడుగు, బలహీన వర్గాలు, పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. రాష్ట్రంలో గతంలో జరగని అభివృద్ధిని చేసి చూపింటం వల్ల జగనన్న రెండోసారి సీఎంగా కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, మళ్లీ సీయంగా చేయ్యాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నవంబర్ 1 నుంచి 40 రోజుల పాటు కార్యక్రమం నిరంతరంగా కొనసాగించాలని చైతన్య కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య, జేసీఎస్ మండల ఇన్‌చార్జి టీ. నరేష్, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ

అద్దంకి రూరల్: రాయితీపై శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జేజీ 11 రకం విత్తనాలు 40 శాతం రాయితీ పొను క్వింటాల్ రూ 4860, కాక్–2 రకం క్వింటాల్ రూ. 8430 చెల్లించాలని తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 5 ఎకరాలకు 40 కేజీల చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద సంప్రదించాలన్నారు.

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించినందున సెలవు దినాల్లో పాఠశాలల నిర్వహణ చేయవద్దని, సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే వారిపై చర్యలు తప్పవని కారంచేడు ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు తప్పకుండా ఈ జీఓను పాటించాలన్నారు. ప్రధానంగా ప్రైవేటు పాఠశాలలను తెరిచినట్లు తెలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండె వైద్య శిబిరాలకు స్పందన

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు గుండె పరీక్షలతో అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేసేందుకు గ్రామ గ్రామాన ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు విజయవాడ హెల్ప్ వైద్యశాల వైద్యాధికారులు, శాయి కిరణ్‌రెడ్డి, శాయి తెలిపారు. శనివారం మండలంలోని గొర్రెపాడు ముక్తేశ్వరం గ్రామాల్లో 145 మందికి గుండె స్కానింగ్, ఈసీజీ, ఎకో, పరీక్షలు చేశారు. వీరిలో 12 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం విజయవాడ వైద్యశాలకు రావాల్సిందిగా సూచించారు. శిబిరం ఏర్పాట్లును గ్రామ సర్పంచ్‌లు యం దానయ్య, ఎం లక్ష్మీ చేపట్టారు.

విపత్తుల నిర్వహణపై క్యాడెట్లకు అవగాహన


రక్తదానం చేస్తున్న కల్నల్ సునీల్ గౌతమ్

చీరాల అర్బన్: ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో వాటిని ఏ విధంగా ఎదుర్కొనాలనే అంశాలపై ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన కల్పించారు. శనివారం చీరాలలోని వీఆర్‌ఎస్‌వైఆర్‌ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో 23 (ఆంధ్ర) బెటాలియన్ ఆధ్వర్యంలో కల్నల్ సునీల్ గౌతమ్ పర్యవేక్షణలో జరుగుతున్న ఏటీసీ–2 ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం క్యాడెట్లకు అవగాహన కల్పించారు. అనంతరం కల్నల్ సునీల్ గౌతమ్, 13 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేసి రక్తదాన ఆవశ్యకతను తెలియచేశారు.

అంతరాయాలు లేని మెరుగైన విద్యుత్


ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతును పర్యవేక్షిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి రూరల్: అంతరాలు లేని మెరుగైన విద్యుత్ అందజేయటానికి కృషి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. శనివారం అద్దంకిలోని నార్త్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న కొత్త ఫీడర్ పనులను, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను ఈఈ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్త్ సబ్ స్టేషన్ నుంచి కాకాని పాలెం వరకు సౌత్ స్టేషన్ నుంచి నాగులపాడు రోడ్డు వరకు కొత్తగా 11 కేవీ లైన్ వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజినీరు టి. సత్యనారాయణ, సహాయక కార్యనిర్వాహక ఇంజినీర్లు ఆర్‌వీఎస్ శివప్రసాద్, వీ.బాల కోటేశ్వరరావు, సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

మరణ దినోత్సవం జరుపుకున్న పాలేటి

చీరాల: చీరాలకు చెందిన మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు తన 11వ మరణ దినోత్సవాన్ని శనివారం రాత్రి స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. తన జన్మదిన వేడుకలను మరణ దిన వేడుకలుగా జరుపుకునే కొత్త సంస్కృతికి గత ఏడాది ఆయన ప్రారంభించారు. వేడుకలకు అందరూ హాజరు కావాలంటూ ఆహ్వాన పత్రికలు కూడా పంపించారు. ఆయన అభిమానుల మధ్య వేడుక నిర్వహించారు.

చూపు కోల్పోయిన వ్యక్తికి ఆర్థిక సాయం

చినగంజాం: చూపు కోల్పోయిన స్నేహితుడికి తోటి స్నేహితులు అండగా నిలబడ్డారు. మండలంలోని పల్లెపాలెం పంచాయతీ పెద్దపల్లెపాలెం గ్రామానికి చెందిన కొక్కిలగడ్డ స్వాములు కళ్లు కన్పించక ఇబ్బందులు పడుతుండటంతో పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయమందించి ఆదుకున్నారు. చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1978–79లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు వారిలో ఒకరిగా మెలిగిన స్వాములు కళ్లు కన్పించటం లేదని తెలుసుకున్నారు. వెంటనే స్పందించి నిధులు సేకరించి శనివారం గ్రామంలోని వారింటికి వెళ్లి రూ.15 వేలు నగదు అతనికి అందించి అందుకున్నారు. కార్యక్రమంలో మేడికొండ బాబురావు, చంద్రశేఖర్, డేవిడ్, కొండేటి వెంకటేశ్వరబాబు, దౌలత్‌ఖాన్, పొట్టి పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


స్వాములుకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇంటింటా సంక్షేమ పథకాలతో సంతోషం

- గడప గడపలో కృష్ణచైతన్య


పథకాల బ్రోచర్ అందజేస్తున్న కృష్ణచైతన్య

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆర్థిక భారం నుంచి గట్టెక్కి ప్రతి ఇల్లు సంతోషకర జీవనం సాగిస్తున్నారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటుపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలతో తామంతా ఆనందంగా ఉన్నామని సంతోషం వెలిబుచ్చారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రపంచ దేశాల్లోనే నెంబర్ వన్ సీఎంగా గుర్తింపు తెచ్చుకున్నారని జగనన్నకు అండగా నిలిచి రెండోసారి సీఎంను చెయ్యాలని చైతన్య కోరారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, బల్లికురవ సోసైటి అధ్యక్షుడు గుర్రం రంగారావు, సర్పంచ్ యం కృష్ణకుమారి, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, మాదాల శివన్నారాయణ, మద్దినేని అశోక్, షేక్ శ్రీనువలి తదితరులు పాల్గొన్నారు